హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	160	180
సూర్యాపేట	రూ.95	140	160
నల్లగొండ	రూ.97	141	160

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 ; కనిష్ఠం 16.4



సాదాబైనామాలకు మోక్షం ఎన్నడో?

ప్రభుత్వాలు మారుతున్నా రైతుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారానికి రైతులు దరఖాస్తులు చేసుకొని మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిష్కారం లభించలేదు. సాదాబైనామాల దరఖాస్తులు స్వీకరించిన గత ప్రభుత్వం వాటిని పరిష్కరించలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- చౌటుప్పల్

దరఖాస్తు చేసుకొని మూడేళ్లు

పట్టాలు రాక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న రైతులు

దశాబ్దాల కాలం క్రితం భూముల క్రయ, విక్రయాలు తెల్లకాగితాలపై జరిగేవి. రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన లేక కొందరు, రిజిస్ట్రేషన్ ఖర్చులను భారంగా భావించి మరికొందరు గతంలో పెద్ద మనుషులు సాక్షులుగా నోటరీ, తెల్ల కాగితాలపై రాసుకొని భూములు క్రయ, విక్రయాలు చేసేవారు. తెల్ల కాగితాలపై రాసుకున్నప్పటికీ ఆ అగ్రిమెంట్ కాగితంతో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని పహాణీలో పేర్లు నమోదు చేయించుకునేవారు. మరి కొంతమంది రైతులు మాత్రం కాగితం రాసుకున్నామనే ధీమాతో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి రికార్డుల్లో పేరు నమోదు చేసుకునేవారు కాదు. తెల్లకాగితంపై రాసుకున్నవి కావడంతో రెవెన్యూ రికార్డుల్లో అవి మ్యుటేషన్ కాలేదు. దీంతో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో వారికి పాస్‌పుస్తకాలు జారీ కాలేదు.

అడ్డంకిగా మారిన కొత్త రెవెన్యూ చట్టం

రాష్ట్రంలో రూపుదిద్దుకున్న హైదరాబాద్ రికార్డ్స్ ఆఫ్ రైట్స్ యాక్ట్ 1948 ప్రకారం తెల్లకాగితాలపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు పట్టాలు ఇచ్చే అధికారం తహసీల్దార్లకు గతంలో ఉండేది. అలాగే ఏటా గ్రామాల్లో జమాబందీ నిర్వహించడం ద్వారా నిజమైన దరఖాస్తుదారులను గుర్తించి తహసీల్దార్లు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసేవారు. 1971లో ఈ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం సవరించి రిజిస్ట్రేషన్ పేపర్లు ఉంటేనే, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలనే నిబంధనతో ఆర్‌వోఆర్ యాక్ట్ 1971 అమలులోకి తీసుకొచ్చింది. దీంతో తెల్లకాగితాలపై రాసుకున్న లావాదేవీలు చెల్లకుండా పోయాయి. 1989లో ఈ చట్టాన్ని సవరించి సాదాబైనామాలను పరిష్కరించే అధికారాన్ని మళ్లీ తహసీల్దార్లకు అప్పగించారు. ఈ సవరణ ఆధారంగానే సాదాబైనామాలకు సంబంధించి గత ప్రభుత్వం అప్పట్లో దరఖాస్తులను తీసుకుంది. అయితే 2020 నుంచి అమలులోకి వచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ధరణిలో డిజిటల్ రూపంలో ఉన్న రికార్డులను రెవెన్యూ రికార్డులుగా ప్రభుత్వం పరిగణించింది. దీంతో సాదాబైనామాల దరఖాస్తులు ఈ చట్టం పరిధిలోకి రాకుండా పోయాయి. కొత్త చట్టం ప్రకారం పాత ఆర్‌వోఆర్ చట్టం రద్దు కావడంతో సాదాబైనామాల సమస్యలు పరిష్కరించే మార్గం లేకుండా పోయింది. కొత్త చట్టాన్ని సవరిస్తే తప్ప సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సాగులో ఒకరు.. రికార్డుల్లో మరొకరు

సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడంతో అప్పటికే భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఇతర వ్యక్తుల నుంచి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాగులో ఒకరు ఉండి, రికార్డుల్లో మరొకరి పేర్లు నమోదై ఉన్నాయి. రికార్డుల్లో పేర్లు నమోదైన వ్యక్తుల వారసులు, కుటుంబ సభ్యుల నుంచి సంబంధిత రైతు లు ఇబ్బందులు పడుతున్నారు.దీంతో ఇరువురిమధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతున్న సందర్భాలు చాలాఉన్నాయి.ఇదే విషయంపై పోలీస్‌స్టేషన్, కోర్టులను ఆశ్రయించిన సందర్భాలూ ఉన్నాయి.

పరిష్కారం కోసం ఎదురుచూపులు

సాదాబైనామాల కింద దరఖాస్తు చేసుకున్న రైతులు సమస్య పరిష్కారం కోసం నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్య పరిష్కారం అవుతుందని ఆశించినా దరఖాస్తుదారులకు నిరాశే మిగిలింది. కొత్త ప్రభుత్వంలోనైనా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తు చేసుకోగా, అందులో కొన్ని దరఖాస్తులకు మోక్షం లభించినా, ఇంకా వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సాదాబైనామాలపై దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవు



సాదాబైనామాల సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు రైతుల నుంచి సాదాబైనామాల దరఖాస్తులను ప్రభుత్వం తీసుకుంది. అప్పట్లో కొన్ని దరఖాస్తులను పరిష్కరించాం. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో సమస్య పరిష్కారమవుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

- కేఎంవీ.జగన్నాథరావు, చౌటుప్పల్ ఆర్డీవో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సార్లు సాదా బైనామాల దరఖాస్తులను తీసుకుంది. 2014 జూన్ 2వ తేదీలోపు తెల్ల కాగితంపై రాసుకున్న లావాదేవీల రెగ్యులరైజేషన్ కోసం 2016లో మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను తీసుకుంది. 2020లో మరోసారి సాదాబైనామాల దరఖాస్తులను తీసుకున్నారు. వాటిలో కొన్ని దరఖాస్తులను అధికారులు పరిష్కరించినా అధికశాతం దరఖాస్తులను తిరస్కరించారు. స్పష్టమైన వివరాలు, ఇతర సమాచారం పూర్తిగా లేకపోవడంతో దరఖాస్తులను తిరస్కరించినట్టు అప్పట్లో అధికారులు వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాదాబైనామాల కింద 54,821 దరఖాస్తులు వచ్చాయి. అందులో యాదాద్రి జిల్లాలో 7,962 దరఖాస్తులు వచ్చాయి. 3,176 దరఖాస్తులను అధికారులు పరిష్కరించి 3,786 దరఖాస్తులను తిరస్కరించారు. నల్లగొండ జిల్లాలో 28,314 దరఖాస్తులు రాగా, అందులో 14,234 పరిష్కరించి, 13,080 దరఖాస్తులను తిరస్కరించారు. సూర్యాపేట జిల్లాలో 18,545 దరఖాస్తులు రాగా, అందులో 8,652 దరఖాస్తులను పరిష్కరించి, 8,564 దరఖాస్తులను తిరస్కరించారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని చేరుకోవాలి

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, పాల్గొన్న అధికారులు

భువనగిరి అర్బన్, జనవరి 8: రోజు వారి పర్యవేక్షణతో సీఎంఆర్ లక్ష్యాన్ని చేరుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేయించి ఎఫ్‌సీఐకి చేరేలా పర్యవేక్షించాలన్నారు. గత డిసెంబరు 31 నాటికే ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోటా చేరాల్సి ఉండగా, జిల్లాలో మిల్లింగ్ ప్రక్రియ పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉందన్నారు. ఎఫ్‌సీఐ గడువు పొడగించినందున నిర్ణీత సమయంలోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలు చేరేలా చూడాలన్నారు. మిల్లర్లు పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లులను అధికారులు నిరంతరం తనిఖీచేస్తూ, పూర్తిస్థాయిలో మిల్లింగ్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించి అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ దందాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెంచాలని, పోలీసు అధికారులను సమన్వయం చేస్తూ అక్రమార్కులను గుర్తించి కఠినంగా వ్యవహరించాలన్నారు. అభయహస్తం కింద ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా ఎంట్రీ జరిగేలా పర్యవేక్షించి నిర్ణీత సమయంలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, డీపీవో సునంద, పౌర సరఫరాల మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

24న ప్రత్యేక సమావేశం ● కౌన్సిలర్లకు నోటీసు జారీ చేసిన కలెక్టర్



హుజూర్‌నగర్, జనవరి 8 : హుజూర్‌నగర్ మునిసిపల్ వైస్‌చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై అవిశ్వాస సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరావు మొ త్తం 28 మంది కౌన్సిలర్లకు ఈ నెల 6న నోటీసులు జారీచేశారు. దీం తో వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస వ్యవహారం రసవత్తరంగా మారింది. గతంలోనే మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా 17 మంది అవిశ్వాసం నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో మునిసిపాలిటీలో రాజకీయ పార్టీల బలాబలాలు పూర్తిగా తారుమారయ్యాయి. గతంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన చైర్మన్ గెల్లి అర్చన కాంగ్రెస్ పార్టీలో చేరగా వైస్‌చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం ప్రయత్నాలు చేస్తోంది. 2020 జనవరిలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏడు మునిసిపల్ కౌన్సిలర్ స్థానాలు, సీపీఎం ఒకటి, బీఆర్ఎస్ 20 గెలుపొందాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో చైర్మన్‌తో పాటు ముగ్గురు కౌన్సిలర్లు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల అనంతరం మరో ఆరుగురు కాంగ్రెస్‌లో చేరారు. మొత్తంగా బీఆర్ఎస్ నుంచి 10 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక బీఆర్ఎస్‌లో ప్రస్తుతం 10 మంది కౌన్సిలర్లు ఉండగా ఈ నెల 24న జరగనున్న వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నాటికి మరికొందరు పార్టీ మారే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కలెక్టర్ అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు నోటీసులు అందించడంతో కాంగ్రెస్ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. ఇదిలా ఉండగా వైస్‌చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకోనుంది. ప్రస్తుతం చేరికలతో 17 మంది కౌన్సిలర్లు ఉండగా కాగా వారం రోజుల్లో మరికొందరు చేరే అవకాశం ఉంది. దీంతో వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీలో వైస్‌చైర్మన్ అభ్యర్థి ఎవరన్నది తేలాల్సి ఉంది. ఈ నెల 12వ తేదీలోపు ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. అప్పటిలోగా కౌన్సిలర్ల అభిప్రాయాన్ని సేకరించనున్నారు.

సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల మాసోత్సవాలు

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 8: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని సహకార బ్యాంకుల్లో రెండు మాసాల పాటు డిపాజిట్ల మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం డీసీసీబీలో రూ.665కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, జనవరి, ఫిబ్రవరి నెలలో డిపాజిట్ల మాసోత్సవాల సందర్భంగా పెద్ద మొత్తంలో డిపాజిట్లు చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలే ఉన్నందున, ప్రతీ ఉద్యోగి, అధికారి డిపాజిట్లపై దృష్టి సారించాలన్నారు. డిపాజిట్లకు రైతులు, ప్రజలు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.302కోట్ల మేర బంగారంపై రుణాలు గ్రాముకు రూ.4500 చొప్పున ఇచ్చామన్నారు. 333రోజుల డిపాజిట్‌కు వడ్డీ 7.75శాతం చెల్లిస్తామన్నారు. అదేవిధంగా 111రోజుల డిపాజిట్ వడ్డీ 6.50శాతం ఇస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, అంజయ్య, రంగాచారి, రామాచారి, జైరాం, బంటు శ్రీను, కరుణ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

సీఈవో పోస్టుకు 14 దరఖాస్తులు

జిల్లా సహకార బ్యాంకు సీఈవో పోస్టుకు 14 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సీఈవో మదన్‌మోహన్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు డీసీసీబీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుకు నాబార్డుకు చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఈనెల 18, 19, 20 తేదీల్లో ఏదో ఒకరోజు ఇంటర్వ్యూలు నిర్వహించి సీఈవోను ఎంపిక చేయనున్నట్టు తెలిసింది.

అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 8 : అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవంలో ఆయన మాట్లాడారు. బ్రెయిలీ పడిన ఇబ్బందులు ఇతరులు పడకూడదనే ఉద్దేశ్యంతో 175 ఏళ్ల క్రితమే అంధుల కోసం బ్రెయిలీ లిపిని కనిపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జ్యోతి పద్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి దయానందరాణి, డాక్టర్ వెంకటరమణ, అంధుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉర్సు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

జానపహాడ్ ఉర్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే జానపహాడ్ ఉర్సు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. దర్గా పరిసరాల్లో నిరంతరం విద్యుత్, తాగునీరు, మెడికల్ క్యాంపులకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ఉర్సు నిర్వాహణ నేపథ్యంలో నోడల్ అధికారిగా హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వ్యవహరించనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో సురేష్‌కుమార్, డీపీవో యాదయ్య, డీఎస్పీ నాగభూషణం, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూద్, జానపహాడ్ సర్పంచ్ క్రిష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజావాణిలో ప్రజలు అందించే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేయలేదన్నారు. ఆయా చీరెలను అధికారులు పంపిణీ చేయాలన్నారు.

దరఖాస్తుల నమోదు ప్రక్రియలో వేగం పెంచాలి

ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోరోజైన సోమవారం 1,59,013 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు.

అర్హులందరికీ ఉజ్వల యోజన

జిల్లాలోని అర్హులందరికీ ఉజ్వల యోజన కింద నూతన గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకటరావు అన్నారు. కలెక్టరేట్‌లో సివిల్ సప్లయి అధికారులు, గ్యాస్ ఏజెన్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద కొత్తగ్యాస్ కనెక్షన్ కోసం గ్యాస్ ఏజెన్సీల ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు, డీటీ నాగలక్ష్మీ, రాంరెడ్డి, రాజశేఖర్, విజయశేఖర్ పాల్గొన్నారు.

కూరగాయల లోడు పేరిట గంజాయి రవాణా

నల్లగొండ జిల్లాలో రూ.84లక్షల విలువైన గంజాయి పట్టివేత ●7లో..

●7లో..

నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా హరిచందన బాధ్యతల స్వీకరణ

స్వాగతం పలికిన ఎస్పీ, అదనపు కలెక్టర్



బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

నల్లగొండ, జనవరి 8: జిల్లా కలెక్టర్‌గా దాసరి హరిచందన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు పలు శాఖల అధికారులు సాదర స్వాగతం పలికారు. తన ఛాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్‌ను ఎస్పీ చందనా దీప్తి, ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలు శాఖల అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది నూతన కలెక్టర్‌కు పూల బొకేలు అందజేశారు.

వరంగల్ ఎన్ఐటీతో ఎయిమ్స్ ఒప్పందం



ఎయిమ్స్‌లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన డైరెక్టర్ వికాస్ భాటియా, ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి

బీబీనగర్, జనవరి 8: బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ సహకారం కోసం వరంగల్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం ఎయిమ్స్‌లో డైరెక్టర్ వికాస్ భాటియా, ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు ప్రతిష్ఠాత్మక సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా రెండు సంస్థలు వనరులు, విజ్ఞాన నైపుణ్యాన్ని ఇచ్చిపుచ్చుకొని గణనీయ పురోగతి సాధించేందుకు దోహదపడుతుందన్నారు. ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, మెడికల్ ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయం, క్రాస్ డిసిప్లినరీ లెర్నింగ్ అవకాశాలు, ఉమ్మడి సెమినార్‌లు వర్క్‌షాప్‌ల నిర్వహణకు ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో సంచలనాత్మక పరిశోధనాలకు ఈ రెండు సంస్థలు వేదికలు పంచుకోనున్నాయని అన్నారు.

రైతులకు నష్టం కలిగించే స్టోన్ క్రషర్ ప్లాంట్‌ను మూసివేయాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్) జనవరి 8 : రైతులకు నష్టం కలిగించే విధంగా ఆత్మకూర్(ఎస్)మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన స్టోన్ క్రషర్ ప్లాంట్‌ను వెంటనే మూసివేయాలని అఖిలపక్ష నాయకులు సోమవారం కలెక్టర్ వెంకటరావుకు అందజేశారు. ఈసందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ క్రషర్ చుట్టుపక్కల గ్రామాల్లో పర్యావరణ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, ఇళ్ల గోడలు బీటలు బారుతున్నాయన్నారు. పెద్దగుట్టపైన క్రషర్ మిల్లు, బాంబు బ్లాస్టింగ్‌లతో వందలాది ఎకరాల పంటలకు తీరని నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూర్(ఎస్) సర్పంచ్ వీరారెడ్డి, కాకి కృపాకర్‌రెడ్డి, తంగెళ్ల పెదవీరారెడ్డి, గుణగంటి శ్రీను, కృష్ణమూర్తి, రాంగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎల్లయ్య, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహరులకు విశేష పూజలు




స్ఫటిక మూర్తులను పుష్పాలతో అర్చిస్తున్న అర్చకులు , ప్రధానాలయంలో తిరుప్పావై పాశుర పఠనం చేస్తున్న అర్చకులు, మహిళలు

యాదగిరిగుట్ట, జనవరి 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం లక్ష్మీనృసింహుడికి, శైవాగమ పద్ధతిలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు ప్రధానాలయంలోని ఉత్తర దిశలో మొదటి ప్రాకార మండపంలో ధనుర్మాస వేడుకలను నిర్వహించారు. స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించిన అర్చకులు తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణోత్సం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి మహా మండపంలో స్ఫటిక మూర్తులను అభిషేకించిన అర్చకులు బిల్వ పత్రాలతో అర్చించారు. సాయంత్రం వేళ ఉత్సవ మూర్తులను పల్లకి సేవలో తీర్చిద్ది సేవోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా స్వామివారిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఏఈవో దోర్బల భాస్కర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండకింద స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, బందారపు భిక్షపతిగౌడ్, మారగోని శ్రీరాంమూర్తి, ఎస్‌డీ సలీం, మిట్ట రాంచందర్‌గౌడ్, దేవస్థానం ప్రధానార్చకుడు ఎన్.లక్ష్మీనరసింహచార్యులు, ఏఈవోలు రాంమోహన్‌రావు, గజ్వేల్ రఘు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ధనుర్మాస వేడుకలు

హుజూర్‌నగర్ రూరల్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పాశుర పఠనం నిర్వహించారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, గండు సైదులు, రామస్వామి, పూర్ణ పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు శోభాయాత్ర ఆహ్వానపత్రిక

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల-శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 9న నిర్వహించనున్న శోభాయాత్రకు హాజరుకావాలని మంత్రి ఉత్తమ్‌ను ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి ఆహ్వాన పత్రిక, దేవాలయ చిత్రపటాన్ని అందజేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతీ ఇంటిలో రామ నామస్మరణ వినిపించాలి



చౌటుప్పల్‌లో రామపూజిత అక్షింతల శోభాయాత్ర

చౌటుప్పల్ టౌన్/ రామన్నపేట/ జనవరి 8: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే ఈ నెల 22న ప్రతీ ఇంటిలో రామ నామస్మరణ వినిపించాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్ పీ శ్రీధర్‌బాబు అన్నారు. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో సోమవారం రామపూజిత అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకు ముందు సీతారామ చంద్ర స్వామి దేవాలయం నుంచి 20 వార్డుల్లోకి అక్షింతల కలశాలతో రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఊడుగు వెంకటేష్, సందగళ్ల సతీష్, కామిశెట్టి భాస్కర్, తాడూరి పరమేష్, డి. భిక్షమాచారి, కె.అనంత రెడ్డి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, ఊడుగు రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కాలనీలోని ఇంటింటికీ అయోధ్య రామాలయ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కన్నెకంటి వేంకటేశ్వరచారి, చెన్నకేశ్వర దేవాలయం చైర్మన్ లవణం ఉపేందర్, భక్తులు చిందం లింగయ్య, బాతరాజు అశోక్, కట్కూరి భిక్షపతి, మామిండ్ల ధీరజ్, మెట్టె సుధీర్, మాంద్ర సత్యనారాయణ, సాయిదీప్, వెంకట్, వంశీ, నామనంది. వినయ్, లవణం, సంతోష్, కొంపల్లి సుదేశ్, శీల నాగభూషణం పాల్గొన్నారు.

కోదాడ ఎంపీపీ కవిత రాజీనామా

కోదాడ రూరల్, జనవరి 8 : సూర్యాపేట జిల్లా కోదాడ ఎంపీపీ చింతా కవిత సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాపత్రాన్ని ఆమె జిల్లా కేంద్రంలోని జడ్పీ సీఈవో సురేష్‌కు అందజేశారు. దీంతో ఆయన ఆమె రాజీనామాను ఆమోదిస్తూ వైస్‌ఎంపీపీగా ఉన్న మల్లెల రాణికి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీపీగా కవిత అక్రమాలకు పాల్పడ్డారని, కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ నెలరోజుల కిందట ఏడుగురు ఎంపీటీసీలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుపై విచారణ చేసి, మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కోదాడ ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. విచారణలో ఎంపీపీ కవిత తన పదవీకాలంలో అభివృద్ధి పనుల్లో అక్రమాలతో పాటు మండల పరిషత్‌కు చెందిన భవన సముదాయాలకు సంబంధించిన అద్దె డబ్బులు తీసుకున్నట్లు షాపు యజమానులు ఆర్డీవో విచారణలో తేలింది. అక్రమాలపై ఆర్డీవో రికార్డులు స్వాధీనం చేసుకుని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, మూడురోజుల కిందటే నివేదికను కలెక్టర్‌కు అందించారు. దీంతో ఎంపీపీపై కలెక్టర్ వేటు వేయడానికి ముందే ఆమె రాజీనామా చేశారు. ఎంపీపీగా కవిత రాజీనామా చేయడంపై మండలంలోని గుడిబండ, రెడ్లకుంట, కాపుగల్లు, గణపవరం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చారు.

కోదాడ ఇన్‌చార్జి ఎంపీపీగా మల్లెల రాణి



ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లెల రాణి

కోదాడ ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్‌ఎంపీపీ మల్లెల రాణి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కవిత రాజీనామా చేయడంతో వైస్‌ఎంపీపీ రాణికి బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో సురేష్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ కోదాడ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాణిని జడ్పీటీసీ క్రిష్ణకుమారి, ఎంపీటీసీలు క్రాంతికుమార్, కలకొండ సౌజన్య బాలక్రిష్ణ, శంకరశెట్టి కోటేశ్వరరావు, రెడ్లకుంట సర్పంచ్ లీలా అప్పారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి అభినందించారు.

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, జనవరి 8: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కుడి కాల్వకు ఏపీ ప్రాంత తాగునీటి అవసరాల కోసం సోమవారం సాయంత్రం ఆ ప్రాంత నీటి పారుదలశాఖ అధికారులు నీటి విడుదల ప్రారంభించారు. కేఆర్‌ఎంబీ సభ్యుడు అజయ్‌కుమార్ పర్యవేక్షణలో కుడి కాల్వ 5, 7వ నంబరు గేట్ల ద్వారా ఒక్కో గేటు నుంచి 2,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏపీ ఎన్నెస్పీ సీఈ మురళీధర్‌రెడ్డి తెలిపారు. రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజుల్లో మొత్తం ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఆర్‌ఎంబీ ఈఈలు రఘునందన్‌రావు, శివశంకర్, లింగంగుంట్ల సర్కిల్ ఎస్‌ఈ వరలక్ష్మి, సాగర్ ఏపీ ఈఈ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాలుమియా, భారతి పాల్గొన్నారు.

సైదులు బాబా.. సమస్యలు తీర్చవా?

కుల, మతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా సమస్యల నిలయంలో కొట్టుమిట్టాడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో జాన్‌పహాడ్ దుర్గాకు ప్రత్యేకత ఉంది. కందూరు పేరుతో జాన్‌పహాడ్ సైదన్నకు ఉర్సు సమయంలో లక్షల్లో, ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి మెక్కులు తీర్చుకుంటారు. ఇదిలా ఉండగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సుమారు 2 లక్షల మంది భక్తులు ఉత్సవాల్లో మొక్కులు తీర్చుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలు దగ్గరపడుతున్నా మౌలిక సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

● పాలకవీడు




నిరుపయోగంగా ఉన్న మంచినీటి బావి, శిథిలావస్థలో మరుగుదొడ్లు, స్నానపుగదులునిరుపయోగంగా ఉన్న మంచీనీటి బావి, శిథిలావస్థలో మరుగుదొడ్లు, స్నానపుగదులు

దర్గా వద్ద మౌలిక వసతులు కూడా కల్పించిన నిర్వాహకులు మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. మహిళలు స్నానపుగదులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు మారుతున్నా భక్తులకు వసతులు కల్పించడంలో పూర్తిగా చెందుతున్నారు. దర్గా పక్కనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా భక్తులకు తాగునీటిని అందించడంలో వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగు నీరు కోసం చాలా దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల కుళాయి ఏర్పాటుచేసినా ఆ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో భక్తులు ఆ నీటిని తాగడం లేదు. ఉర్సు సమయంలో 2 లక్షల మంది భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ముఖ్యంగా మహిళలకు బట్టలు మార్చుకునేందుకు సరైన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు అంతంత మాత్రమే. ఉర్సుకు వచ్చిన భక్తులు కందూరు కింద మూగజీవాలను బలిచ్చి అక్కడే వండుకు తింటారు. అయితే షెడ్లు లేకపోవడంతో దుమ్ముధూళి మధ్య ఆరుబయటనే వండుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా దర్గాలో నిద్ర చేస్తే ఆరోగ్యం కుదుట పడుతుందని భక్తుల విశ్వాసం. దీంతో వారు జాగారాల పేరుతో దర్గాలోనే పడుకుంటారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా వక్ఫ్‌బోర్డ్ అధికారులు ఈ ప్రాంతంలో భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు నయా పైసా ఖర్చు చేయలేదు. ఎక్కువగా ఇక్కడికి నిరుపేదలు, గిరిజనులు అధికంగా వస్తారు. ఆదాయం మీద శ్రద్ధ తప్ప భక్తులకు వసతుల కల్పించడంలో వక్ఫ్‌బోర్డు నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది ఉత్సవాల నాటికైనా కనీస వసతులు కల్పించాలని, దర్గా ప్రాంతంలో సీసీరోడ్లు వేసి, మురుగు కాల్వలు నిర్మించాలని, ఇతర సౌకర్యాలు అందించాలని భక్తులు కోరుతున్నారు.

బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు

జాన్‌పహాడ్ దర్గాకి వచ్చిన భక్తుల దగ్గర కాంటాక్టర్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. చిన్నతనం నుంచి ప్రతీ ఏడాది దర్గాకు వచ్చి మొక్కులు తీసుకుంటున్నా. ఇప్పుడు ఒక యాటపోతుతో కందూరు చేయాలంటే కాంట్రాక్టర్లకే రూ.3వేల వరకు ఇవ్వాల్సి వస్తోంది. కందూరు ఖర్చు ఎంత ఖర్చు వస్తుందో అంతకంటే ఎక్కువ పైసలు వసూలు చేస్తున్నారు. డబ్బులు తీసుకుంటున్నారు కానీ సరైన సౌకర్యాలు కల్పించడంలేదు. స్నానపు గదులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల్లేక మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. భక్తలకు సౌకర్యాలు కల్పించాలి.



● రంగయ్య, భక్తుడు, సూర్యాపేట

దర్గా ఉర్సుకు రూ.13 లక్షల నిధులు కేటాయింపు

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ రూ.13లక్షల నిధులు కేటాయించారు. స్నానపుగదులు, మరుగుదొడుఌ, విశ్రాంతి గదుల నిర్మాణాలు చేపడతాం. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

● మహమూద్, వక్ఫ్‌బోర్డు అధికారి, జాన్‌పహాడ్ దర్గా

గ్రామీణ యువతకు ఎస్‌ఆర్‌టీఆర్‌ఐలో

శిక్షణా కార్యక్రమాలు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 8 : వివిధ రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా జలాల్‌పురంలోని రామానందతీర్థ గ్రామీణసంస్థ(ఎస్‌ఆర్‌టీఆర్‌ఐ) ఇన్‌చార్జి డైరెక్టర్ పీఎస్‌ఎస్‌ఆర్ లక్ష్మి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు హాజరయ్యే యువకులకు హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన - డీడీయూజీకేవై ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తిగల గ్రామీణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మూడు నెలల కాలపరిమితితో ఇంటర్ పాస్ అర్హత గలవారికి బేసిక్ కంప్యూటర్స్(డాటా ఎంట్రీ ఆపరేటర్లు), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, బీకామ్ పాస్ అయిన వారికి ఎకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), పదవ తరగతి పాస్ అయిన వారికి ఆటో మొబైల్- టూవీలర్ సర్వీసింగ్, నాలుగు నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్ అయిన వారికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్, ఐదు నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్, ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యత కలిగిన ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె వివరించారు. దరఖాస్తులతో పాటు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సంస్థ కార్యాలయంలో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు 18-35 వయస్సు వారై ఉండాలని, గ్రామీణులై ఉండాలని, చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222/ 9948466111 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెన్‌పహాడ్, జనవరి 8 : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్‌తో మండవ శైలజకు చెందిన పూరిల్లు సోమవారం దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ స్వప్న పరిశీలించారు. ఘటనలో ధాన్యం, రూ.25 వేల నగదు, తులం బంగారం, సామాగ్రి కాలిపోయినట్లు ఆర్‌ఐ తెలిపారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందన్నారు. బాధితురాలికి ప్రభుత్వ ఆర్థికసాయం అందేలా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు డిమాండ్ చేశారు.

కూరగాయల లోడు పేరిట గంజాయి రవాణా

నల్లగొండ, జనవరి 8 : కూరగాయల లోడు పేరిట గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.84లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం నల్లగొండలోని కార్యాలయంలో ఎస్పీ చందనా దీప్తి విలేకరులకు వివరించారు. మహారాష్ట్రకు చెందిన గ్యానోబా అమోల్ ఘోరే డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఆ క్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన గంజాయి సరఫరా చేసే జైపాల్ అనే వ్యక్తి పరిచయమైంది. ఈ క్రమంలో గ్యానోబా అమోల్ ఘోరేకి విజయనగరం నుంచి గంజాయి తీసుకువచ్చి మహారాష్ట్రలో తాను చెప్పిన వ్యక్తికి సరఫరా చేస్తే లక్ష రూపాయలు ఇస్తానని ఘోరేకి జైపాల్ చెప్పాడు. అందుకు అంగీకరించిన ఘోరే తనతో పాటు మరో ముగ్గురు మహారాష్ట్రకు చెందిన గణపతి బస్వరాజు సోనాల్, సంఘమేశ్వర సదాశివ జంగనే, ఖయ్యుం ఇశాకేలను ఈ పనిలో భాగస్వామ్యం చేశాడు. విజయనగరంలో గంజాయిని తీసుకుని బయలుదేరారు. వరంగల్ మీదుగా వెళ్తే పట్టుబడతామని భావించి రూటు మార్చి గుంటూరు, మాచర్ల మీదుగా సాగర్‌కు చేరుకున్నారు.

పక్కా సమాచారంతో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అంతర్ రాష్ట్ర ముఠా డీసీఎం వాహనంలో గంజాయిని తరలిస్తోందని తెలియడంతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయపురి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు వద్ద తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఎంహెచ్24ఏయూ5425 నెంబరు కలిగిన డీసీఎం టమోటాల లోడుతో ఆ వాహనాన్ని తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న వ్యక్తులు దిగి పారిపోతుండగా వారిని పట్టుకుని వాహనాన్ని తనిఖీ చేశారు. తాము విజయనగరంలో టమాటాల లోడు దించి వస్తున్నామని, ఖాళీ ట్రేలు ఉన్నాయని చెప్పారు. పోలీసు సిబ్బంది పరిశీలించగా, గోధుమరంగు టేప్ చుట్టి ఉన్న 168 గంజాయి ప్యాకెట్లను పేర్చి వాటిపైన 300 ట్రేలు పెట్టినట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు మహారాష్ట్రకు చెందిన వారుగా తెలిపారు. గంజాయి విలువ రూ.84లక్షలు ఉంటుందని, నలుగురి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. మరో నిందితుడైన జైపాల్‌తో పాటు మరో నలుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. అక్రమ గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు తీసుకున్నా, గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే డయల్ నెంబర్-100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



నల్లగొండ జిల్లాలో గంజాయితో పట్టుబడిన నిందితులు

రైతులను ఆదుకుంటాం

కొడకండ్ల, జనవరి 8 : సరిపడా సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండలకేంద్రంలోని బయ్యన్న రిజర్వాయర్ వద్ద పూజలు చేసి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాగు నీరందించేందుకు అనేక ప్రాజెక్టులను కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారని తెలిపారు. గత సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంతో, ప్రధానమంత్రి మోదీతో సత్సంబంధాలు ఏర్పరుచుకోలేదని, రేవంత్‌రెడ్డి సీఎం కాగానే మెరుగయ్యాయన్నారు. కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, కాంగ్రెస్ నాయకులు అనురాధ, వివేక్ రెడ్డి, అంబేడ్కర్, విజయకుమార్, నీటి పారుదల శాఖ ఈఈ రమేశ్, డీఈలు పాల్గొన్నారు.



బయ్యన్న రిజర్వాయర్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సామేలు

బైక్‌ను ఢీకొన్న కారు: యువకుడి మృతి

అర్వపల్లి, జనవరి 8 : బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివకుమార్(25) అర్వపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బొల్లంపల్లి గ్రామ స్టేజీ వద్ద సూర్యాపేట-జనగాం జాతీయ రహదారి(365)పై తుంగతుర్తి నుంచి అర్వపల్లి వైపు వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా అతివేగంతో ఢీకొట్టి, 10 మీటర్ల వరకు కారు యువకుడిని ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. తండ్రి పాల్వాయి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.



పాల్వాయి శివ కుమార్(ఫైల్‌ఫొటో)

శబరిమలలో గుండెపోటుతో ...

18 మెట్లు ఎక్కుతుండగా ఘటన

ఆత్మకూర్(ఎస్), జనవరి 8 : అయ్యప్ప ఇరుముడి చెల్లింపు కోసం శబరిమలకు వెళ్లిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన వ్యక్తి గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మరో ఐదు నిమిషాల్లో స్వామి దర్శనం అవుతుందనగా గుండెపోటుకు గురయ్యారు. మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉయ్యాల లింగయ్య(37) నాలుగు రోజుల కిందట ఇరుముడితో వెళ్లి శబరిమలలో 18 మెట్లు ఎక్కే సమయంలో గుండెపోటుతో కుప్పకూలాడు. స్థానికులు భద్రత సిబ్బంది ప్రథమ చికిత్స చేసినప్పటికీ లింగయ్య మృతి చెందాడని అక్కడి స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందింది. లింగయ్య కొంతకాలంగా సూర్యాపేట పట్టణంలో నివాసముంటూ వాటర్ ప్లాంటు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత గురువారం శబరిమల దర్శనానికి ఇరుముడితో వెళ్లి గుండెపోటుతో మృతి చెందడం గ్రామస్తులను ఆవేదనకు గురిచేసింది. శబరిమల ట్రస్టు సహకారంతో లింగయ్య మృతదేహాన్ని స్వగ్రామం తుమ్మల పెన్‌పహాడ్ కు తీసుకువస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. లింగయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



లింగయ్య(ఫైల్‌ఫొటో)

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

రామన్నపేట, జనవరి 8 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ కే సాలకమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు సంజీవయ్యనగర్ కాలనీకి చెందిన బొడ్డు శ్రీరాములు(45) పూలవ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరుచూ ఇంటికి తాగి వస్తున్నాడు. మద్యం తాగి వచ్చిన శ్రీరాములును ఆయన కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టాలపై మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీరాములు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ కే సాలకమ్మ తెలిపారు. శ్రీరాములుకు భార్య, ఇద్దరు కుమార్తె, కుమారుడు ఉన్నారు.



శ్రీరాములు(ఫైల్‌ఫొటో)

ఆంధ్రజ్యోతి ఎడిటర్

మాతృమూర్తి అస్తికల నిమజ్జనం

దామరచర్ల, జనవరి 8 : ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లకుంట రంగనాయకమ్మ అస్తికలను నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద సోమవారం నిమజ్జనం చేశారు. కుటుంబసభ్యులతో పాటు బంధువులు వాడపల్లిలోని కృష్ణా-మూసీ నదుల సంగమం వద్ద మరబోటులో వెళ్లి అస్తికలను నిమజ్జనం చేశారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా కండ్లకుంట రంగనాయకమ్మ తల్లిగారి స్వస్థలం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు.

కుటుంబ కలహాలతో

భర్త దాడి

● అనంతరం తనకు తానుగా కత్తిపోట్లు

● ఇద్దరి పరిస్థితి విషమం

చివ్వేంల, జనవరి 8: కుటుంబ కలహాలతో భార్యపై దాడి చేసిన భర్త అనంతరం తనకు తాను కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆదివారం అర్ధరాత్రి మండలంలోని కుడకుడలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కుడకుడ గ్రామానికి చెందిన కప్పల శ్రీను-స్వప్న దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వీరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహంతో ఉన్న శ్రీను భార్య స్వప్నపై కత్తితో, కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన భార్యను చూసిన శ్రీను ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగి భార్య స్వప్నపై దాడి చేసిన కత్తితో తనకు తానుగా పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. దాడి సమయంలో అరుపుకేకలు వినబడటంతో చుట్టుపక్కల వారు శ్రీను ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పటికే గాయాలతో ఉన్న ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. స్వప్న తండ్రి జెజ్జూరి రాజయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా గాజుల పండుగ



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాజులను అలంకరించుకున్న మహిళలు

సూర్యాపేట కల్చరల్, జనవరి 8: జిల్లా కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ దేవాలయంలో మహిళలు గాజుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఒక మగ సంతానం ఉన్న తల్లి, ఇద్దరు మగ సంతానం ఉన్న తల్లితో గాజులు అలంకరించుకోవాలని, లేనిచో కీడు జరుగుతుందని ప్రచారం జరిగింది. దీంతో మహిళలు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలివచ్చి ఒకరికొకరు గాజులు వేసుకున్నారు. కార్యక్రమంలో రాచర్ల లక్ష్మి, ప్రేమలత, తోట కమల, గుండా శ్రీదేవి, సుధామాధురి, జ్యోతి, నీలిమ, సువర్ణ, శారద, భాగ్యలక్ష్మి, రమాదేవి, విజయ, పద్మ, సునీత పాల్గొన్నారు.

సింహాసనం అధిష్ఠించిన శ్రీనివాసుడు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు, పూజల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట కల్చరల్, జనవరి 8: ధనుర్మాస వ్రత ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి ప్రత్యేక సింహాసనాన్ని అధిరోహించిన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి దేవాలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, గజ్జెల రవీందర్, నాగరాజు, శేఖర్, మంజుల, అరుణమ్మ, విజయ, వనజ, పద్మ, అండాళ్ గోష్ఠి, వికాస తరంగిణి భక్త బృందం పాల్గొంది.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక హారతి

మేళ్లచెర్వు, జనవరి 8: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలోని భూనీల సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక మంగళహారతులు అందించారు. కార్యక్రమంలో అర్చకులు ప్రసాద్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు

అయోధ్య రామమందిర అక్షింతల పంపిణీ

కోదాడ టౌన్, జనవరి 8: అయోధ్య రామమందిర అక్షింతలను సోమవారం పట్టణంలోని గుంటి రఘునాథస్వామి దేవాలయంలో భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి క్రిష్ణయ్య, నూనె సులోచన, గీత, వాసవి పాల్గొన్నారు.

అవినీతిపై న్యాయవిచారణ చేపట్టాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాపంథా నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 8: సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలో అభివృద్ధి పేరుతో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. 2014నుంచి 2023వరకు సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలో అభివృద్ధి పేరిట వందల కోట్ల అవినీతి జరిగిందని, ప్రతి పనినీ కమీషన్ కోసం కేవలం ఒకే కాంట్రాక్టర్‌కు ఇచ్చారని ఆరోపించారు. జరిగిన పనుల్లో నాణ్యత లోపించిందని. ప్రారంభించిన కొన్ని రోజులకే సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయని, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లేనందున అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, భూక్య రాంజీ, వాజిద్, గులాం హస్సేన్, వేర్పుల పరశురాం, లక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరి, ఉపేందర్, చిరంజీవి పాల్గొన్నారు.

దాతల సహకారం నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న పోలీస్ ట్రాఫిక్ స్టాండ్లు

సూర్యాపేటటౌన్, జనవరి 8: దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ స్టాండ్లు నిరుపయోగంగా మారాయి. ట్రాఫిక్ పోలీసులు వీటిని ఉపయోగించడం లేదు. దీంతో ఇవి మూలనపడ్డాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రం

ఇబ్బంది పడుతున్న ప్రజలు

పెన్‌పహాడ్, జనవరి 8: మండల కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మండలాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించు కోవడం లేదు. దీంతో దాదాపు 50ఏళ్ల క్రితం మండలం ఏర్పడినప్పటి నుంచి పెన్‌పహాడ్ మండలం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వెనకబడింది. జిల్లా కేంద్రానికి 20కిలో మీటర్ల దూరంలో ఉన్న పెన్‌పహాడ్ మండల కేంద్రంలో వివిధ శాఖల కార్యాలయాలు మాత్రమే ఉన్నాయి. మండలంలో సరైన దుకాణాలు, ప్రభుత్వ కళాశాల, మార్కెటు లేవు. మండలంలోని 29గ్రామాల ప్రజలు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే. స్టాంప్, నోటరీ, అఫిడవిట్, ఆధార్ ఎంట్రీ సెంటరు, మినీ బ్యాంక్ సర్వీస్, సరైన హోటల్స్, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, నిత్యావసర వస్తువులు లభించే పరిస్థితి లేదు. దీంతో మండల ప్రజలంతా ఎంతో వ్యయప్రయాసలతో సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లాల్సివస్తోంది. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కూడా లేనందున ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. పాలకులు స్పందించి మండల కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పెన్‌పహాడ్ మండల కేంద్రం వ్యూ

ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ కళాశాల, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేయాలి. మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

● రావిరాల శోభారాణి, సర్పంచ్, చెట్లముకుందాపురం గ్రామం

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం



మునగోడు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్‌కు బొకే అందజేస్తున్న కాంగ్రెస్ నేత నరేష్

తిరుమలగిరి, జనవరి 8: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వపు వైభవం తీసుకువస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కలిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అహంకారం, నిరంకుశత్వం, ఇసుక దోపిడి, అవినీతి, భూకబ్జాదారులకు తుంగతుర్తి ప్రజలు సరైన గుణపాఠం చెప్పి, మంచి నాయకుడిని ఎన్నుకున్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ సమస్యలు తనకు తెలుసునని అన్నారు సామేల్‌ను గెలిపించిన తుంగతుర్తి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనరేష్ సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, పేరాల వీరేష్, జుమ్మీలాల్, అంబేద్కర్, సుంకరి, జనార్దన్, తిరుమని యాదగిరి, లక్ష్మయ్య, అబ్బాస్, మోహన్ పాల్గొన్నారు.

చివరి భూములకు సాగునీరందిస్తాం

తిరుమలగిరి: కాలువ చివరి భూములకు గోదావరి జలాలను అందిస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నియోజకవర్గానికి బయ్యన్నవాగు ద్వారా ఎస్సారెస్పీ కాలువలోవకి వచ్చే సాగునీటిని జనగామ జిల్లా కొడకండ్ల గ్రామంలో విడుదల చేశారు. కాలువకు హారతులు ఇచ్చి, పూలుజల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు అండగా ఉంటానని, సాగు నీటి కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైనరేష్, నీటిపారుదల శాఖ అధికారులు, హఫీజ్, జుమ్మీలాల్, లక్ష్మయ్య, అబ్బాస్, తిరుమలగిరి, కొడకండ్ల మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలను పరిష్కరిస్తాం

తుంగతుర్తి: గురుకులాల్లో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేసి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతుల కొరత ఉందని. భవనంపై ఉన్న రేకుల షెడ్ ఇటీవల వచ్చిన గాలి దుమారంతో కొట్టుకుపోయిందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గురుకుల సెక్రటరీకి ఎమ్మెల్యే ఫోన్ చేసి పాఠశాలలోసమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భీమ్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, దొంగరి గోవర్ధన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ, జనవరి 8: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నడిగూడెం, చిలుకూరు మండలాల ప్రజలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. కటకమ్మగూడెం రోడ్డులో క్రికెట్ పోటీలను, శ్రీమన్నారాయణ కాలనీలో ముగ్గుల పోటీలను ప్రారంభించారు. కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కోదాడలో ఆశ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, సామినేని ప్రమీల, రమేష్, దేవబత్తిని నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

నూతన చట్టాన్ని ఉపసంహరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లు

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 8: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జయహో రథసారథి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసు ఏలేటి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నూతన చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగితే డ్రైవర్లకు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.7లక్షల జరిమానా విధిస్తూ తీసుకున్న నిర్ణయం కార్మికులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. డ్రైవర్లు, క్లీనర్లకు వచ్చే చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాలను పోషించడమే కష్టంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మరోసారి నూతన చట్టం అమలు విషయంలో పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్‌కు అందచేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధనుంజయ్, లింగస్వామి, రామాంజనేయులు, అంజి, షకీల్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

అర్చనాదేవికి ప్రతిభా పురస్కారం

హుజూర్‌నగర్, జనవరి 8: కవయిత్రి పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీపాద అర్చనదేవి ప్రతిభ కనబర్చారు. రాజమండ్రిలోని గైట్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ రెండో తెలుగు మహాసభల పోటీల్లో కవితా గానం చేసిన అర్చనదేవికి నిర్వాహకులు ఆంధ్రా సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, వ్యవస్థాపకుడు చైతన్యరాజు, సమన్వయకర్త ఎస్ఆర్ఎస్ కొల్లూరు రాజేష్, డాక్టర్ కేటీ పద్మ ప్రశంసాపత్రం, గోల్డ్‌మెడల్ అందజేశారు. కార్యక్రమంలో రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



అర్చనాదేవికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న చింత వెంకన్న

సూర్యాపేట అర్బన్, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్లు, నిధులు, నియామకాలు లేక అనేక వర్గాలతో పాటు నిరుద్యోగులు ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు చేపట్టి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మహేష్, విజయ్‌కుమార్, గణేష్, పరశురాములు, జగదీష్, ప్రమీల, స్వాతి, రుచిత పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడ రూరల్, జనవరి 8: ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రా నుంచి తెలంగాణ మీదుగా హైదరాబాద్ వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను సోమవారం తెల్లవారుజామున మండలంలోని కాపుగల్లు గ్రామం వద్ద పట్టుకున్నామన్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నేరేడుచర్లలో స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఈవో చత్రునాయక్

నేరేడుచర్ల, గరిడేపల్లి, జనవరి 8: విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల, పెంచికల్‌దిన్న, మేడారం, నేరేడుచర్ల, దాచారం, సోమారం, చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 200మందికి, గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కస్తూర్బా పాఠశాలతో పాటు, మండలంలోని వెలిదండ, రాయినిగూడెం, పొనుగోడు, కీతవారిగూడెంలోని పాఠశాలల్లో పదో తరగతి తరగతి చదువుతున్న 300మందికి విద్యార్థినీ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి మాట్లాడారు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు బట్టు మధు, ఎం.సువర్ణ,ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి కోటయ్య, పిడమర్తి వీరబాబు, ఎలకపల్లి మహేష్, నవీన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు యం.సువర్ణ, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, కోటేశ్వరరావు, రఫీ, రాంరెడ్డి, సీతారాం, ధర్మేష్, ఖాజా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి

తిరుమలగిరి, జనవరి 8: పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల భవనం వద్ద జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. పెన్షనర్లు సుదర్శన్‌రావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, కృష్ణమాచారి, పద్మమ్మ, నాగమణి, సుదర్శన్ రెడ్డి, సారంగుల నర్సయ్య, బన్వరి నర్సయ్య, వడ్లకొండ యాకయ్య, రాములు, మల్లయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.


క్రీడలతోనే మానసికోల్లాసం: డీఎస్పీ

మేళ్లచెర్వు, జనవరి 8: క్రీడలతోనే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతోందని డీఎస్పీ ప్రకాష్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చింతలపాలెం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్లను ఎంపిక చేశాం

హుజూర్‌నగర్, జనవరి 8: హుజూర్‌నగర్‌లో ఆదివారం జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశామన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్, జగదీష్‌యాదవ్ ఆదేశాల మేరకు జూనియర్ బాలబాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పూర్తయిందన్నారు. కోదాడలో మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి నామా నరసింహారావు తన పేరుతో చేసిన ప్రకటనను నమ్మొద్దన్నారు.

పెన్‌పహాడ్, జనవరి 8: మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో ఆదివారం రాత్రి ఫర్నీచర్, పుస్తకాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు గ్రంథాలయ అధికారి డి శ్రీనివాస్ పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రతిరోజు రాత్రి గ్రామానికి చెందిన ఆకతాయిలు గ్రంథాలయ ఆవరణలో మద్యం తాగుతున్నారని తెలిపారు. నిందితులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయం పై గ్రంథాలయ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వెంకన్నగౌడ్ తెలిపారు.



సూర్యాపేట అర్బన్: యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని సోమవారం ఓ ప్రైవేట్ కళాశాలలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మట్టపల్లిరాముయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెల్లా వెంకటేశ్వర్లుయాదవ్, కోశాధికారిగా వీరబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా మర్యాద సైదులుయాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దొంగరి మహేష్, అల్లినాగయ్య, బయ్య మల్లికార్జున, మన్నె యాదగిరి, వెంకట్, జటంగి వీరస్వామి , కొమ్మ శ్రీశైలం పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ పార్కులో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగార్జునగౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీపాద జానకిరాములు, వెంకటేష్, రమేష్, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని గాంధీపార్క్ సెంటరులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు.సమావేశంలో యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాసు, కొప్పోజు సూర్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, జడ శ్రీను, గుండా రమేష్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, స్టాలిన్ పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన రావులపాటి ఉపేందర్, సుజాతలు ఇటీవల మృతి చెందగా, వారి పిల్లలు ఒంటరయ్యారు. ఆ కుటుంబానికి ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు సులువ శ్రీనివాస్, చంద్రశేఖర్, చందు, శివకుమార్, రమేష్, యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారికి మహానివేదన గావించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని వర్దాపురం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు తండ్రి కోటయ్య(68) సోమవారం మృతి చెందాడు. కోటయ్య మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, నాగుల్‌మీరా, దుర్గయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

తుంగతుర్తి: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ మామిడి వెంకన్న అన్నారు. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడ రాజీవ్‌సాగర్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో గాంధీ, నేతాజీ, అంబేద్కర్, యువసారథి యువజన సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ వైద్య శిబిరంలో రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఉపసర్పంచు పరమేష్, తెలంగాణ జాగృతి నాయకులు గఫార్ తదితరులు పాల్గొన్నారు.

●భువనగిరి ఎంపీ టికెట్‌ను బడుగు బలహీన వర్గాలకు చెందిన చెవిటి వెంకన్నకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడునడ్డి కృష్ణమూర్తి అన్నారు. తుంగుతర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూవెంకన్న తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం 30ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శివ, ఉప్పలయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: బయ్యన్న వాగు నుంచి ఎస్సారెస్పీ నీటిని తుంగతుర్తి నియోజక వర్గానికి ఎమ్మెల్యే మందుల సామేల్ విడుదల చేసే కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీటీసీ పన్నాల రమ మల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళ వెంకటయ్య, కళ్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, చురికంటి చంద్రారెడ్డి, జటంగి గణేష్‌యాదవ్, ఇమ్మారెడ్డి రాజబహదూర్‌రెడ్డి, ఇరుగు కిరణ్ బంటు బద్రి, బంటు క్రాంతి తదితరులు ఉన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ముందుంటుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు పెద్దింటి రంగారెడ్డి, దేశోజు మధు అన్నారు. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన లింగరాజు, కృష్ణ, నాగరాజుతో పాటు మరికొందరు ఆ పార్టీలో చేరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనందున ప్రజలు గద్దె దించారన్నారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దగ్గుల మల్లయ్య, బోలగాని రమేష్, బిక్షి, ప్రవీణ్, పులుసు క్రాంతి, మణికుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగిఉండాలి



శివస్వామికి మొక్కుతున్న భక్తులు

మునగాల రూరల్: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అయోధ్య రామ మందిరం నిర్మాణ కమిటీ మెంబర్, తాళ్లాయపాలెంలోని శ్రీకోటిలింగ మహాశైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీలో ఉన్న ఇందిర వృద్ధ అనాథశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ దంపతులు, సామాజిక కార్యకర్త వేమూరి సత్యనారాయణ రమాదేవి దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో మహాశైవ క్షేత్రం అన్నసంతర్పణ కమిటీ అధ్యక్షుడు చెరుకుమల్లి వెంకట నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఇడుకుళ్ల చెన్నకేశవరావు, ఎడాలి శ్రీనివాసరావు, రవి, రేష్, ఆశ్రమం కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, అరుణ, పందిరి నాగిరెడ్డి, వెంకట్రావు, భక్తులు, వృద్ధులు పాల్గొన్నారు.